జాగ్రత్త రహస్య

వక్కలంక సరళ

ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్న నా చెల్లెలు లలిత చెప్పిన 'కథ' ఇది.

★ ★ ★ ★

స్త్రీలను, అందులోనూ ఉద్యోగం చేస్తున్న స్త్రీలను చిన్న చూపు చూడకూడదు. వారు పురుషులకి ఎంత మాత్రమూ, ఏ విషయంలోనూ తీసిపోరు అని సమాన హక్కుల కోసం పోరాడే స్త్రీలకి చక్కని గుణపాఠం నేర్పుతుంది ప్రభుత్వం. ఎలాగంటారా చెప్పా చెయ్యకుండా ఒకచోటి నుంచి మరోచోటికి బదిలీ చెయ్యడం. సరే! భర్తకి, భార్యకి, వీలున్నంత వరకు ఒకేచోట ఉద్యోగం ఇవ్వడానికి ప్రయత్నించాలి అన్న విషయాన్ని ఒక హక్కుగా భావించి మనం అడగడానికి వీల్లేదు. వారే దయతలచి చేస్తేనరి. లేకపోతే మనం దరఖాస్తులు పెట్టుకోవడం, వారు వాటిని 'పరిశీలించి' ఏవో జవాబులు పంపడం జరిగి, జరిగి చివరికి ఆ పుణ్యకాలం వచ్చేసరికి మన అవసరం ప్రభుత్వానికీ, ప్రభుత్వం అవసరం మనకీ తీరిపోతుంది.

సరిగ్గా నా విషయంలో అలాగే జరిగింది. ఒకానొక సుప్రభాతం, మా ఆఫీసు ప్యూను మా ఇంటికి వచ్చి ప్రసన్న వదనంతో ఒక సలాము కొట్టి ఓ పొడుగాటి

గోధుమ రంగు కవరు [పైన చిరునామా, డెలివర్డ్ బై హేండ్ అని రాయబడి, కింద ఆఫీను ముద్ర, తారీకులతో సహా] నా చేతికి అందజేశారు. ఈ గోధుమ రంగు కవర్లకి ఓ ప్రత్యేకత ఉంది. మన ఇళ్లలో పెద్దవాళ్లు 'టెలిగ్రాం' అన్న కేక విన్నా 'టెలిగ్రామ్' కాగితాన్ని చూసినా ఏదో చెడ్డ కబురే అని తెగ భయపడిపోతారు. అందుకు తగినట్టు 'చెడ్డ కబుర్లకే టెలిగ్రామ్' లు ఇవ్వడం అవసరం అని భావించడం కూడా వరిపాటి అయిపోయింది.

ఇప్పుడు కాలం మారిపోయిందనుకోండి. ప్రేమలో పడిన 'టీనేజర్'లకి ఉత్తరాలు రాసే ఓపిక ఉండక 'ఐ లవ్ యూ' అని 'టెలిగ్రామ్' ల వర్షం కురిపిస్తూ ఉంటారు ఒకరి మీద ఒకరు. ఇంతకీ ఈ గోధుమ రంగు కవర్లకి కూడా మంచి కబుర్ల కంటే చెడ్డ కబుర్లు మొయ్యడం అలవాటయిపోయింది. ప్రభుత్వానికి వీటితో ఆడుకోవడంలో ఒక పైశాచిక ఆనందం ఉంటుంది. ఆ వంపిన ఆఫీసరుగాడు, తన కింద పని చేసే వాళ్ల చేతిలో ఆ కవరు పడ్డప్పుడు, ఆ కవరు చించి అందులోని కబురు చదువుతున్నప్పుడు, వాళ్ల మారే ముఖ కవళికలను, సినిమా రీలులాగా తన మనోఫలకం మీద చూసి మురిసిపోతాడనుకుంటాను. నిన్న సాయంత్రం దాకా ఆఫీసులో ఉన్న మనిషికి తెలపని కబురు ఇవాళ కవరులో ఇంటికి వంపడమెందుకు, ఈ 'థ్రిల్' కోసం కాకపోతే?

ముందు రోజున ఆఫీసులో మా 'కొలీగ్స్' మధ్య సంభాషణ ఈ విధంగా సాగింది.

"పాపం సుబ్బారావుకి ట్రాన్స్‌ఫర్ అయిందిట!"

"ఏడేళ్లుగా ఒకేచోట పాతుక్కూర్చున్నాడు. ఇప్పటికైనా కదలకపోతే మరోడికి 'ఛాన్స్' ఎలా వస్తుంది?"

"అవున్లెండి! గాని ఆడవాళ్లదే ప్రాబ్లం! ఆ మిసెస్ లలితగారిని చూడండి. ఇదిగో, అదిగో అని బెదిరిస్తున్నారు. ఇక్కడ నుంచి పిల్లా జెల్లాతో మరో ఊరు వెళ్లడమంటే మాటలా! పోనీ! వాళ్లాయన ఉన్న ఊళ్లో ఈవిడ 'పోస్టు!' లేదాయే!"

"అయినా ఆవిడకి చాలా 'ఎప్రోచ్' ఉందయ్యా బాబూ! 'ట్రాన్స్‌ఫర్' వచ్చినా ఆపించేయగల సమర్థురాలు.'

నాకు ఇంక వినబుద్ధి కాలేదు. ఆ 'అప్రోచ్' అన్న మాటకు గూఢార్థాలు ఎన్నో ఉన్నాయి. ఆడది అనగానే 'పై అధికారిని, ఆ పైన మినిస్ట్రీలో అధికారుల దాకా అందరినీ లోబరచుకుని పనులు సాధించుకుంటుంది' అని వాళ్ల [మగవాళ్ల] నమ్మకం. ఈ నేపథ్యంలో, బదిలీకి మామూలుగా ప్రయత్నించినా తాటాకులు కట్టక మానరు - ఏ ఉద్యోగినికైనా.

నరే 'బ్రౌన్ కవర్' నాకు చల్లగా తెచ్చిన చావు కబురు - దేశ రాజధాని నగరం నుంచి జలంధర్‌కు బదిలీ అయినట్టు, వారంలో జాయినవాలి. చక్కని 'క్వార్టర్స్', పిల్లలకి దగ్గరలో మంచి స్కూలు, తతిమ్మా అన్ని సౌకర్యాలూ గల ఈ ఊరు వదలి వెళ్లడమా? వెళ్లిన చోట మళ్లీ అన్నీ మొదటి నుంచీ ప్రయత్నం చెయ్యాలి. రేషన్ కార్డూ, గ్యాస్, పిల్లల స్కూళ్లూ, అన్నిటికీ మించి క్వార్టర్సు దొరికేదాకా తలదాచుకోడానికి అద్దె ఇల్లు. వేరే మనిషి సహాయం లేకుండా ఇదంతా నే నొక్కదాన్ని సాధించగలనా? కొలీగ్స్ దయా దాక్షిణ్యాల పైన ఆధారపడడం నా కిష్టం లేకపోయినా తప్పదేమో!

ఆ రోజు నుంచి ప్రారంభమయ్యాయి నా కష్టాలు. మర్నాడు ఆఫీసుకి వెళ్లగానే స్వాగతం పలికారు నా కొలీగ్స్ పరామర్శలతో. నేను చెప్పకుండానే, నాకు తెలియకుండానే జరిగిన నా బదిలీ వాళ్లందరికీ ఎలాగో ముందే తెలిసింది. ఒక్కొక్కరూ ఒక్కో రకం సలహా ఇవ్వడం, నేను నిస్సహాయంగా వినడం, [తప్పదు కదా మరి! వారంతా నా శ్రేయోభిలాషులు!] ఇలా సాయంత్రం దాకా జరిగింది.

"లలిత గారూ! పాపం ట్రాన్స్‌ఫర్ అయిందటగా?"

"మరీ అంత సడన్‌గా వెళ్లమన్నారేమిటండీ! వారం రోజులే జాయినింగ్ టైమ్ ఇచ్చారటగా!"

"మీకేం భయం లేదండీ! ఇక్కడి నుంచి వెళ్లిన మన వాళ్లు ఇద్దరు ముగ్గురున్నారు ఆ ఆఫీసులో. వాళ్లు - ఆ ఊరు చాలా మంచిది! అన్ని వసతులూ ఉన్నాయి - అంటున్నారు!

"పరీక్ష లయేదాకా పిల్లల్ని మా ఇంట్లో ఉంచండి. తరవాత తీసుకెడుదురుగాని." [సానుభూతితో ఒక లేడీ కొలీగ].

(మిగతా 60వ పేజీలో)

నిద్రాముద్ర

నిజంగా రాత్రిని నిద్ర మినహా జయించలేం!
ప్రావాస ప్రియుణ్ణి జ్ఞాపకాల రాత్రిని
క్షణక్షణించే మానసిక సంచలనాన్ని
మహా సంగ్రామంలో పాల్గొనే యుద్ధ వీరుణ్ణి
కలయికకి నిరీక్షించే సైనిక పత్ని స్పందనని,
రేపటి కాంక్షలతో నిదురపోని రాత్రిని
ఎన్నెన్ని ఆవేశాలు అంతర్గయించో
రెప్పలు వాల్చని స్థితిలో
ఒక్కొక్క వెలుగు రేకూ వరచుకొంటూ
తెల్లారుతున్న చప్పుడుకి
దింపుడు కళ్లంలో ప్రాణ సృష్టి జరిగే దృశ్యం
ఒంటరి రాత్రిని నిద్ర మినహా జయించలేం!

నిద్ర రాని రాత్రిపూట అంత్యక్రియల గూళ్లో దీపారాధన
ఎక్కడనుంచో వల్మీకాన్ని ఛేదిస్తున్న మెదడు పొరల చప్పుడు
సుషుప్తి నుండి చైతన్యం
జాగ్రదవస్థ నుండి మగతలోకి చలించే ఆలోచనలు
బెజ్జంలోకి దూరలేని దారంలా జ్ఞాపకాలు
ఉబ్బిన కళ్ల జీరల్లో నర్తయజ్ఞ దృశ్యం
అన్నీ కోల్పోయిన మనిషిలానే ఉంటుంది
నిద్రపోలేని మనసు!



నిద్రోపహతులు యశోధరో, రావణుడో,
మృతుడి సమీప బంధువులో
ఎవరైతేనేం
రాత్రి మనకు విధించిన శాపంలానే ఉంటుంది.
నిద్రలేమి
వేల నిశారాత్రి నిముషాల్ని ఒక్కొక్కటిగ
లెక్కబెట్టే మనిషికి మాత్రమే తెలుసు!
దుఃఖ స్వప్నం లాంటి కలత నిదురలో
ఉలిక్కిపడడం మాత్రమే తెలుసు!
దేహవినర్తన కాంక్ష బలీయమై
జీవితాన్ని అన్యాక్రాంతం చేయడం తెలుసు!
నిదుర తప్ప జీవితాన్ని జయించలేం!

ఒక సుఖ నిద్రా స్పర్శ
చెట్టు కొనల్లోంచి రాలిన తేనె చుక్కలు
పెదాల్ని తడుపుతున్న అనుభవా న్నిస్తుంది!

కె. రామమోహనశర్మ,

"జలంధర్ ఏమంత దూరంలెండి - మద్రాసు - విజయవాడ లాగే. ఐదారు గంటల ప్రయాణం - ఎప్పుడువడితే అప్పుడు వచ్చి వెళుతూ ఉండవచ్చును. ఏ 'దిబ్రుగరో' వేస్తే ఎలా ఉండేది ఊహించుకోండి!"

నా మస్తిష్కంలో వెయ్యి ఆలోచనలు. ఎవరిని అడిగితే సరియైన సలహా ఇస్తారా అని సతమతమవుతూ రోజంతా మౌనంగా అందరి మాటలూ విని ఇంటికి వచ్చేశాను. మరునటి రోజు ఆఫీసుకి వెళ్లినప్పుడు నా ముఖమే చెప్పినట్టుంది నా అంతర్మథనం గురించి. అందరూ మళ్లీ చర్చ ప్రారంభించారు. చేతి నిండా పని లేని మా ఆఫీసులో ఇలాంటి 'సెన్సేషనల్ న్యూస్' దొరికితే నోటికీ, బుర్రకీ కూడా కావలసినంత పని.

"ఏమిటండీ లలితగారూ, మీకు వెళ్లాలని లేనట్టుంది! నే నొక ఉపాయం చెబుతా వినండి. మీరు వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇచ్చి 'ఏన్యుయల్ లీవ్' పెట్టి వచ్చేయండి. మీకు బోల్డు లీవు పడి ఉందిగా? వచ్చాక తాపీగా ఆలోచించవచ్చు ఆ పైన తీసుకోవలసిన చర్య. కావాలంటే మళ్లీ ఇక్కడికే బదిలీకి ప్రయత్నించవచ్చు కూడా. ఇప్పుడు వెళ్లకుండా ఉంటే మీ సి. ఆర్. [కాన్ఫిడెన్షియల్ రిపోర్టు] లో ఏదన్నా 'ఎడ్వర్స్' గా రాస్తాడు ఆ మహానుభావుడు?" అని ఒకరి సలహా.

"ఏమిటండీ! మీ 'ఎరన్డ్' లీవంతా ఇలా తిరగడానికి వినియోగిస్తే అవసరమొచ్చినప్పుడు లీవు ఎక్కడ దొరుకుతుందండీ మళ్లీ! నా మాట విని 'మెడికల్ లీవ్' పెట్టండి. ఎవడు అడ్డు పెడతాడో చూస్తాను నేను!" మరొకరి సలహా.

"ఛీ... ఛీ... నిక్షేపంగా, ఆరోగ్యంగా ఉన్న మనిషిని 'మెడికల్ లీవ్' పెట్టమంటావేమయ్యా! అలాంటివి చేస్తే రేపు నిజంగానే ఏ జబ్బున్నా వట్టుకుంటుంది." ఒక "నూవర్ స్టేషన్స్" కొలీగ్ మాట.

"అక్కడ జాయిన్ అయితే ఇక్కడి క్వార్టర్స్ ఎంతలేదన్నా ఆరు నెలల్లో ఖాళీ చెయ్యాలి. లేదా మార్కెట్ రెంట్ [అంటే ఇప్పటి కంటె ఐదు రెట్లు] ఇవ్వాలి. ఈ ప్రాబ్లంస్ ఉన్నాయి కదయ్యా!"

నా బుర్ర వేడెక్కిపోతోంది. అందరి సలహాలూ, సమంజసంగానే తోచాయి గాని ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నాను. ఇంటికి వెళ్లాక మా వారికి ఫోన్ చేసి మాట్లాడి ఆయన అభిప్రాయం కనుక్కోవాలి. అప్పటికి సమస్య ఒక కొలిక్కి వస్తుందేమో అనుకోగానే కాస్తంత మనశ్శాంతి కలిగింది.

రాత్రి మా వారికి ఫోన్ చేసి విషయం చెప్పాను.

"నీకు ఏది సరి అని తోస్తే అది చెయ్యి. నీ ఆఫీస్ పరిస్థితు లేమిటో నేనేం చెప్పగలను?"

"అది కాదండీ, పిల్లలకి ఇప్పుడు "మిడ్ టెర్మ్" పరీక్షలు - వాళ్లని కూడా తీసుకెళ్లలేను. ఇక్కడ వదిలీ వెళ్లలేను."

"అయితే వెళ్లకు."

"వెళ్లకపోతే ఎలా! వారంలో జాయిన్ అవమన్నారు కదా!"

"తప్పదంటే వెళ్లాలి మరి!"

"మరి పిల్లల మాట?"

"హాస్టల్‌లో వేద్దామంటే ఒద్దన్నావుగా, ఇప్పుడు తెలిసొచ్చిందా!"

మా వారి వల్ల నా సమస్య పరిష్కారం కాదని తెలిసి పోయింది. అది ఎప్పుడో తెలిసిన విషయమైనా మునిగేవాడికి ఒక గడ్డిపోచ దొరికినా పట్టుకున్నట్టు ఏదైనా ఒక మార్గం సూచించకపోతారా అన్న ఆశతో ఫోన్ చేశాను. పర్యవసానం ఇది.

కథ మళ్లీ మొదటికి వచ్చింది. తెల్లవార్లూ మథనపడి ఒక నిర్ణయానికొచ్చాను. అందరి సలహాలూ, కొంత కొంత తీసుకోవడమే ఆ నిర్ణయం. ఓ వారంలో కొత్తచోటికి వెళ్లి డ్యూటీలో జాయినవడం, తరువాత సెలవు పెట్టి రావడం, ఆ సెలవు అలా పొడిగిస్తూ పోవడం [మధ్య మధ్య మెడికల్ లీవ్‌తో సహా] ఆ వ్యవధిలో మళ్లీ వెనక్కి బదిలీకి దరఖాస్తు పెట్టుకోవడం - ఈ వారం రోజులూ పిల్లల్ని స్నేహితుల ఇళ్లలో వదిలి వెళ్లడం...

పైన చెప్పిన చర్యలన్నీ అనుకున్న ప్రకారం చకచకా సాగిపోయాయి. ఇక ఆఖరి చర్య దరఖాస్తులో రాయవలసిన కారణాలు. ఆ కారణాలు ఎంత పటిష్ఠంగా ఉండాలంటే ప్రభుత్వం నా దరఖాస్తు మీద చర్య తీసుకోక తప్పదు అనిపించాలి. ఈ విషయమై ఆలోచిస్తూ ఉండగానే ఆరు నెలలు గడిచిపోయాయి. అద్దె ఇప్పటి నుంచీ ఐదు రెట్లు కట్టాలి అన్నమాట. "హాఫ్ పే లీవ్" మీద ఉన్న నాకు ఇది మూలిగే నక్క మీద తాటికాయలాగా.

ఆఖరికి పిల్లల చదువులు మరో పూర్లో కొనసాగించడానికి వీలువడదని [ఇక్కడ తెలుగు మీడియం ఉపయోగపడింది] మా వారికి ఇక్కడికిగానీ, నాకు మావారు ఉన్నచోటికిగానీ బదిలీ అయే అవకాశం లేదు కాబట్టి పిల్లల బాధ్యత నాదేననీ, ఇలా దయనీయంగా రాసి దరఖాస్తు పెట్టుకున్నాను. ఆ దరఖాస్తు 'ప్రాపర్ ఛానల్' అంటే రాచబాట గుండా మినిస్ట్రీకి వెళ్లడానికి రెండు నెలలూ, ఆ తరవాత మా ఆఫీసుకీ, మినిస్ట్రీకీ ఉత్తర ప్రత్యుత్తరాలు మరో నాలుగు నెలలూ పట్టింది.

నా ఇల్లు విషయం ఆఖరి ఘట్టంలోకి వచ్చింది. బదిలీ అయి ఒక సంవత్సరం పూర్తి అవబోతున్నది. కనక ఫలానా తేదీ తరవాత ఎట్టి పరిస్థితులలోనూ ఆ ఇంట్లో ఉండడానికి అనుమతించమని 'హౌసింగ్ మినిస్ట్రీ ఉత్తర్వు జారీ చేసింది. ఈ నాలుగు రోజుల గడువు లోపున నా బదిలీ విషయం తెలిస్తే ఇల్లు నిలబెట్టుకోవచ్చు. లేదంటే నేనూ, పిల్లలూ వీధినపడవలసిందే.

నాకు దిక్కు తోచక మళ్లీ స్నేహితులను సంప్రదించాను. "మీరేమీ బాధపడవద్దు. ఇక్కడ మన తెలుగు ఎం. పి. లు పెద్ద పెద్ద భవనాలలో ఉంటున్నారు. వాళ్లలో ఎవరినన్నా ఒక వాటా అడిగితే ఇస్తారు. మళ్లీ మీరు వెనక్కి బదిలీ చేయించుకున్నాక ఇంటికి అప్పై చెయ్యవచ్చును. నాకు తెలిసిన 'ఫలానా' ఎం. పి. ని అడగండి. నేను చెప్పానని చెప్పండి. తప్పక సహాయం చేస్తాడు. నేను కూడా ఫోన్ చేస్తాను అన్నారు నాకు పరిచయస్థులైన రావుగారు. ఈ బాధలన్నీ ఎందుకు, అద్దె ఇల్లు వెతుక్కోవచ్చును గదా! అని ఒక్కొక్కప్పుడు తోచినా మహా నగరాల్లో ఇల్లు దొరకడం ఎంత కష్టమో పడిన వాళ్లకే తెలుస్తుంది.

రావు గారు చెప్పిన ప్రకారం 'ఆ' ఎం. పి. కి ఫోన్ చేసి మాట్లాడాను.

"అలాగే, రేపు మధ్యాన్నం వచ్చి నన్ను కలుసుకోండి. వీలు చూసి చెబుతా" అన్నాడు.

ఇల్లు ఖాళీ చెయ్యవలసిన తేదీ ఇంకా నాలుగే రోజులుందనీ 'టెన్షన్' పెరిగిపోయిన నాకీ చల్లని వార్త కొండంత బలాన్నిచ్చింది.

ఎప్పుడెప్పుడు "రేపు మధ్యాహ్నం' వస్తుందా? అని కాచుకుని మర్నాడు మూడు గంటలకి టంచనుగా 'ఆ' ఎం. పి. ఇంటికి వెళ్లి వాలాను. చుట్టూ విశాలమైన కాంపౌండ్ - మధ్య లంకంత కొంపలో ఒక్క పురుగు కూడా ఉన్నట్టు కనపడలేదు. అసలు ఈ పెద్ద మనిషి ఉన్నాడా లేడా అనుకుంటూ వెళ్ళి నెమ్మదిగా తలుపు తట్టాను. ఫోన్‌లో అన్నాడేగానీ ఇల్లు ఇచ్చే ఉద్దేశం లేదులాగుంది. అందుకనే ఇలా తప్పించుకు తిరుగుతున్నాడేమో అనుకోగానే గుండె నీరైపోయింది. ఇంతలో ఒక పని కుర్రవాడు వచ్చి తలుపు తెరిచి హిందీలో 'ఎవరు కావాలండీ' అని అడిగాడు, చెప్పాను. ఒక దుమ్ము పట్టిన

గదిలో ఒక దుమ్ము పట్టిన కుర్చీ చూపించి 'కూర్చోండి; అయ్యగారికి చెప్పి వస్తాను' అని లోపలికి వెళ్లాడు.

'ఏమిటీ ఇతని కుటుంబ సభ్యులు ఎవరూ ఉన్నట్టుగా లేరే' అనుకున్నాను. గుండె నీరసంతో పాటు వెన్నులో నన్నగా వణుకు మొదలయింది. ఇప్పుడు ధైర్యం కోల్పోతే వచ్చిన పని జరగదు అనుకున్నాను నాకు నేనే. ముళ్ల మీద కూర్చున్నట్టుంది నాకు. ఓ పది నిముషాల తరవాత పని కుర్రవాడు వచ్చి "మిమ్మల్ని రమ్మంటున్నారు." అని చెప్పి వెళ్లిపోయాడు.

ఇక్కడి భవనాలలో ముందు గదులు దాటాక ఒక లోగిలి, తరువాత కొన్ని గదులూ ఉంటాయని తెలుసు కనుక లోగిలి దాటి వెనక హాలు దగ్గరికి వెళ్లాను. సాధారణంగా అందరూ కూర్చునే ఆ హాలులో కాక బెడ్ రూమ్‌లో కూర్చుని ఉన్నాడు. 'ఆ' ఎం. పి. బెడ్ రూమ్ తలుపు తెరిచే ఉంది.

"లోపలికి రా" అని ఏక వచన సంబోధనతో పిలిచాడు.

అతనిని నేను అదే మొదటిసారి చూడడం. ఉద్యోగ రీత్యా కొంత మంది ఎం. పి. లతో ముఖపరిచయమున్నా ఇతన్ని ఎప్పుడూ చూసినట్టు గుర్తు లేదు. బట్టతల, బొజ్జ, లాల్చీ పంచలో, ఒక స్థూలకాయుడు - సుమారు అరవై ఏళ్లు ఉండవచ్చు - కూర్చుని ఉన్నాడు. ఆ గదిలో ఒక డబుల్ కాట్, ఒక కుర్చీ, ఆ కుర్చీ ముందు చిన్న డ్రెసింగ్ టేబిల్ తప్ప వేరేమీ లేవు. ఉన్న ఒక్క కుర్చీ మీద అతను కూర్చుని ఉన్నాడు. నే నెక్కడ కూర్చోడం? అయినా భయాన్ని కప్పిపుచ్చుకుని తలుపుకి దగ్గరగా ఉన్న మంచం భాగంలో అంచున కూర్చున్నాను. ఇంత పెద్ద ఇంట్లో అతనూ, నేనూ మాత్రమే - పని వాడి జాడలేదు. నలుగురి మధ్యా ఉన్నప్పుడు చాలా ధైర్యంగా మాట్లాడగలిగిన నేను ఇక్కడ ఒంటరిగా - ఈ గదిలో - అనుకోగానే వెన్నులో వణుకు ఎక్కువయింది. 'ఫియర్ ఆఫ్ ది అన్‌నోన్' అంటారే - అలాగే అతని పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకోకుండా రావడమే నేను చేసిన పొరపాటు. దాని మూలంగా ఈ భయం, వణుకు. నా తొందరలో నేను రావుగారిని ఈ వివరాలు అడిగి తెలుసుకోలేదు.

మళ్లీ అతనే అడిగాడు.

"నువ్వు, నీ పిల్లలు మట్టుకు ఈ ఊళ్లో ఉంటున్నారా? నాకు నిన్ను గురించి 'డీటెయిల్స్' తెలిస్తేగాని ఇల్లు ఎలా ఇవ్వగలనమ్మా!"

చివరి మాటలు సాగదీస్తూ అన్నాడు.

నాకు కాస్త చికాకేసింది.

"రావుగారు మీకు వివరించే ఉంటారు కదండీ నా పరిస్థితి?"

"అవును. ఏదో చెప్పాడులే. రాత్రి పది గంటలకి వస్తే ఏదో ఒకటి తేల్చి చెప్తాను. రాగలవా?"

"లేదండీ, నాకు ఇంట్లో పంటా వార్పూ ఉంటుంది. దయచేసి మీరే టెలిఫోన్‌లో చెప్పండి. అయినా ఆ మాట మీరు ఇప్పుడయినా చెప్పవచ్చును గదండి!"

"పోనీ రేపొద్దున్నరా. ఇక్కడికి వచ్చాక అన్నీ వివరంగా మాట్లాడుకోవచ్చు."

"పొద్దున్న కూడా ఇంటి పనులుంటాయి. రాలేనండీ!"

"అయితే పన్నెండు గంటలకి రాగలవా?"

ఈ సంభాషణ ఏ దారిని వెళ్తుందో నాకు అర్థం కాలేదు. నన్ను ఇతడు అనుమానిస్తున్నాడా? ఇది వరకు ఎవరికైనా ఇలాంటి సహాయం చేసిన ఫలితం చేదు అనుభవమేమో, అయినా నేను ఇప్పుడు పెడసరంగా మాట్లాడితే నా పని జరగదేమో, రావుగారు 'వచ్చిన అవకాశం పోగొట్టుకున్నారు' అంటారేమో. ఆయన ఏదో ఉపకారం చేద్దామనే కదా చెప్పారు ఇతన్ని కలవమని?

ఇలా తర్కించుకుని, చాలా చాకచక్యంగా మాట్లాడుతున్నాననుకుని.

"మీరు రేపు లోక్‌సభకి వెళ్లరా అండీ?" అని అడిగాను.

"దానిదేముంది! నువ్వొస్తానంటే ఇటు వెళ్లి అటు వచ్చేస్తాను. నువ్వు ఇక్కడికి వచ్చి - నాతోపాటు భోం చేసి, కాస్త విశ్రాంతి తీసుకుని, ఏ మూడు గంటలకో తాపీగా ఇంటికి వెళ్లవచ్చును."

నన్ను గురించి తెలుసుకోవడానికి ఇంత తతంగమా! అతను మాట్లాడుతూ ఉండగానే వెన్నులో వణుకు ఒళ్లంతా పాకడం మొదలుపెట్టింది. ఇక్కడి నుంచి బయటపడడం ఎలాగ! రేపు కాదు కదా మరెప్పుడూ కూడా ఈ ఇంట్లోకి అడుగు పెట్టడం అసంభవం. కానీ రేపు రానంటే ఇప్పుడేం చేస్తాడో నన్ను ఈ తుచ్ఛుడు! అరిచినా చుట్టు పక్కల ఎవరికీ వినబడదు. ఇలా నా ఆలోచనలు బుర్రలో పరిగెడుతున్నాయి. అతను నా ఆలోచనలు పసిగట్టినట్టున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? నన్ను అనుమానిస్తున్నావేమో! ఐ ఏమ్ ఏ జెంటిల్‌మాన్ తెలుసా? నేను నీకు ఇల్లు ఇస్తానని ప్రామిస్ చేసే ముందు నిన్ను గురించి అన్ని వివరాలూ తెలుసుకోవాలి కదా!" అని - "ఐ ఏమ్ ఏ జెంటిల్ మన్" అని మళ్ళీ అన్నాడు.

అప్పుడు తళుక్కున బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది నాకు.

"అబ్బే! అనుమానం ఏం లేదండీ. రేపు అలాగే వస్తానండీ. బాగా ఆలోచించుకునే ఇల్లు ఇవ్వండి. పన్నెండు, పన్నెండున్నర లోపున ఇక్కడ ఉంటానండీ" - ఆత్రుత సిన్సియారిటీ ఉట్టిపడేట్టు అని లేచి నిలుచుని నమస్కారం పెట్టి వెనక్కి తిరిగాను.

గబగబా అడుగులేసుకుంటూ వీధి గుమ్మందాకా వచ్చాక, ఒక్క పరుగున కాంపౌండు దాటి వీధిలో పడ్డాను.

నాకు ఒక్కసారిగా నీరసం ఆవహించింది. ఒక్క అడుగు కూడా ముందు వేయడానికి శక్తి లేక అలాగే వీధి మధ్య నిలబడి పోయాను. కళ్లలోంచి ధారాపాతంగా అశ్రువులు ప్రవహిస్తున్నాయి.

'ఆడది అంటే అంత అలుసా? అవసరమైతే ఆడది ఎంతటి నైచ్యానికైనా దిగజారుతుందనే అనుకుంటారా వీళ్లు! వీళ్లా దేశాన్ని పరిపాలించేవాళ్లు! వీళ్లా ప్రజల మంచి చెడ్డలు చూసేవాళ్ళు! వీళ్లా మానవ సేవ చేసే వాళ్లు! అమాయక ప్రజలు వీళ్లకి ఓటు వేసి అందలం ఎక్కించి, వీళ్లు ఏవో ప్రజాహిత కార్యాలు చేసి పొడిచేస్తారని నమ్మి ఆశతో ఎదురు చూసి, మోసపోతున్నారు. వీళ్లకి లంకంత కొంపలు, జీతాలు, వాహనాలు, రకరకాల వసతులు, ప్రభుత్వం కల్పిస్తోంది.



చివరికి వీళ్లు ఈ ఉన్నత పదవిలో నిలబెట్టిన ప్రజలని మరచిపోయి, అన్ని సౌకర్యాలూ సమకూర్చిన ప్రభుత్వాన్ని మరచిపోయి, ఎటువంటి నికృష్టపు పనులు చేస్తున్నారు!

[వోటు వేసే ముందు ఎవరికి వేస్తున్నారో, ఎందుకు వేస్తున్నారో వాళ్లు పదవికి అర్హులో కాదో తెలుసుకోకుండా ఓటు వెయ్యకండేం! జాగ్ తే రహో!]

పి. ఎస్. [పోస్ట్‌స్క్రిప్ట్] :-

కథ సుఖాంతమా కాదా అని తెలుసుకోవడానికి కుతూహలపడుతున్నారేమో పాఠకులు !

"లీవ్ విత్‌ఔట్ పే" [జీతం లేని సెలవు] లో ఉన్న రోజులవి. ఇల్లు ఖాళీ చెయ్యడానికి ఇంకా నాలుగు రోజులే గడువు. ఆ నాలుగు రోజులూ యమయాతనా 'టెన్షన్'. ఎవరితోనూ ఏమీ చెప్పుకోలేని స్థితి. చెప్పినా వాళ్లు నా మాట నమ్ముతారన్న నమ్మకం నాకు లేదు.

ఆఖరి రోజున మా ఆఫీసు ప్యూను మళ్లీ 'బ్రౌన్ కలర్' తో సహా దర్శనమిచ్చాడు. 'దిస్ ఇస్ ది లాస్ట్ స్ట్రా' ఆఖరి ఘడియ అనుకుంటూ వణికే చేతులతో కవరు తెరిచాను. ఎక్కడి నుంచి వచ్చి ఉంటుంది? వెంటనే డ్యూటీలో చేరమనో లేక ఇల్లు ఖాళీ చెయ్యమనో అయి ఉంటుంది. అయినా నిండా మునిగిన వాడికి చలేమిటిలే!

ఆ ఉత్తరం మా మినిస్ట్రీ నుంచే.

"ఫలానా తేదీన శ్రీమతి లలిత అర్పించిన దరఖాస్తును పరిశీలించడమయింది. అందులో చెప్పబడిన కారణాలు సమంజసమైనవిగా గ్రహించి ఆమెను జలంధర్ నుండి ఢిల్లీకి బదిలీ చేయడమైనది. ఈ ఆర్డరు .... తేదీ నుండి అమలులోకి వస్తుంది!"

ఆ తేదీ నేను ఇల్లు ఖాళీ చెయ్యవలసిన తేదీ!